

కథా కౌముది

టక్ శివ

ఎం.కె.కుమార్

సామీ... ఈ సూట్లు, బూట్లు, మెడకు ఉరితాడు లాంటి టైలు సూసి మనుషులు మారిపోయినారని, బతుకులు బాగుపడిపోయినాయని భ్రమపడిపోబాకండి.

ఈ గాజు మేడల లోపల, ఆ సల్లటి ఏసీ గదుల్లో కూకుంటే మనిషికి స్వేచ్ఛ వచ్చేసినట్టు కాదు. మా తాతల కాలంలో బానిస సంకెళ్లు ఇనుముతో చేసుండేవారు కాబట్టి అవి కండ్లకు కనపడేవి, నడిస్తే గలగలమని చప్పుడు చేసేవి.

ఇప్పుడు ఆ సంకెళ్లు ప్లాస్టిక్ కార్డుల్లాగా, స్మార్ట్ ఫోన్ యాపుల్లాగా, అగ్రిమెంట్ల కాగితాల్లాగా మారిపోయినాయ్. ఇవి కండ్లకు కనపడవు, కానీ ప్రాణాన్ని తోడేస్తాయి. అంతే తేడా

నా పేరు శివ... నా కత చెప్పేముందు మా ముత్తాతల ముత్తాత కత ఒకటుంది, అది మీరు ఇనాల్లా.

ఆ విజయనగర రాజుల కాలం నాటి ముచ్చట ఇది. అప్పుడు శ్రీకృష్ణదేవరాయలు పాలిస్తా ఉండాడో, లేక అలియ రామరాయలు ఏలుతా ఉండాడో నాకు సరిగ్గా ఎరుకలేదు.

గానీ... ఆ దినాల్లో వరుసగా మూడేళ్లు వానలు లేక, రాయలసీమలో పంటలు పండక, జానాల కడుపులు మండిపోతా ఉంటే... మా పెద ముత్తాత వోబులేసు ఊరి పెద కాపు (భూస్వామి) కాడ పది వరహాలు అప్పు చేసినాడంట.

ఏంది ఆ పది వరహాలు? కేవలం ప్రాణాలు నిలబెట్టుకోడానికి, పిల్లాజెల్లాకు గంజి పోయడానికి.

ఆ పది వరహాలకు ఆ కాపు ఏ వడ్డీ ఏసినాడో, ఏ చక్రవడ్డీ కట్టినాడో ఎవరికీ తెలీదు.

ఒక తాళపత్రం మీద మా వోబులేసు తాత బొటనవేలు ముద్ర వేయించుకున్నాడు. ఆ ముద్రతో మా తాత బతుకు ఆ దొర పశువుల పాకలో కొయ్యకు కట్టేసినట్టైంది.

ఆ దినం మొదలు... మా తాత, వాడి కొడుకు, వాడి మనుమడు... అట్టా తరతరాలుగా ఆ దొరల ఇండ్లల్లోనే వెట్టి చాకిరి చేస్తా బతికినారు.

రాత్రింబవళ్లు ఆవుల పేడ ఎత్తాల, పొలాల్లో రక్తం చిందించాల, దొరల కాళ్లు ఒత్తాల. ఆ పది వరహాల అప్పు ఏనాటికీ తీరలా.

కడుపుకు చాలీచాలని గంజి నీళ్లు, ఒంటి మీద మాసిన గుడ్డలు. ఏనాడైనా "నాకు బాగాలేదు సామీ, ఇవాల పనికి రాను" అని మా ముత్తాత అడిగితే... ఆ దొరలు తమ చేతిలో ఉన్న తోలు కొరడాతో వీపులు పగిలేలాగా కొట్టేటోళ్లంట.

అట్టాంటి బానిస బతుకు మాది. వంశపారంపర్యంగా మా నెత్తురు ఆ దొరల పొలాల్లో ఎరువుగా మారిపోయింది.

అట్టాంటి చీకటి బతుకు నుంచి మా నాయన బసవయ్య కాలానికి ఒక చిన్న వెలుగు వచ్చింది.

స్వాతంత్ర్యం వచ్చిన ఇరవయ్యేళ్లకు మా నాయన ఆ పాకల నుంచి బయటపడి, పల్లె చివర ఒక చిన్న పూరిగుడిసె వేసుకుని, కూలి పనులు చేసుకుంటా స్వతంత్రంగా బతకడం మొదలుపెట్టినాడు.

అప్పుల ఊబి నుంచి బయటపడినా, ఆ దరిద్రం మాత్రం మమ్మల్ని ఇడిచిపెట్టలా. కానీ మా నాయన ఒక పట్టు పట్టినాడు.

"నా కొడుకు మట్టి పిసకకూడదు, వాడు చదువుకోవాల, పెద్దోడు కావాల" అని తన రక్తాన్ని నీళ్లు చేసి నన్ను బడికి పంపినాడు.

నేను మా వంశంలోనే మొదటిసారిగా ఇంగిలీషు చదువులు చదివినాను. పట్నంలో బీటెక్ చేసినాను. నేను ఇంజనీరింగ్ పాస్ కాగానే, హైదరాబాదులో ఒక పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో నాకు కొలువు వచ్చింది.

ఆ దినం నా ఆఫర్ లెటర్ తీసుకుని మా పల్లెకు పోతే... మా నాయన కండ్లల్లో నీళ్లు తిరిగినాయి.

"నా కొడుకు సూటు బూటు ఏసినాడు. మా బానిస బతుకులకు ఇంక విముక్తి దొరికినట్టే " అని ఊరంతా చాటింపు వేసినంత పని చేసినాడు.

నాకూ అట్టాగే అనిపించింది సామీ. నెలకు యాభై వేల జీతం... ఆ ఏసీ ఆఫీసు, ఆ తిరిగే కుర్చీలు, కంప్యూటర్లు సూసి నేనేదో మహారాజునైపోనాను అనుకున్నా.

మా వోబులేసు తాత అప్పుల సంకెళ్లు తెంచుకుని స్వేచ్ఛా ప్రపంచంలో ఎగురుతున్న పక్షిలాగా ఫీలయినాను.

కానీ ఆ భ్రమ ఎన్నాళ్లో నిలవలా. నేను ఆఫీసులో అడుగుపెట్టిన ఆరు నెలలకే ఈ కార్పొరేట్ రాబందులు నా చుట్టూ వాలడం మొదలుపెట్టినాయి.

బ్యాంకు వాళ్లు ఫోన్లు చేసి, "సార్, మీరు మా వెరీ స్పెషల్ కస్టమర్. మీకు రెండు లక్షల క్రెడిట్ కార్డు ఫ్రీగా ఇస్తున్నాం. జీవితాంతం ఫ్రీ సార్, తీసుకోండి" అని తీయటి మాటలతో గాలం వేసినారు.

నాకేమో అప్పటికి ఆ మాయ తెలీదు. "నా జీతానికి నేను ఏమైనా కొనుక్కోవచ్చు కదా" అన్న అహంకారం, చేతిలో ప్లాస్టిక్ కార్డు ఉందన్న ధైర్యం నా కళ్లు మూసేశాయి.

మొదట ఆ కార్డు గీకి ఒక ఐఫోన్ కొన్నా. ఆ తర్వాత "నో కాస్ట్ ఈఎంఐ " అంటూ పదివేలు కట్టి ఒక స్పోర్ట్స్ బైక్ కొన్నాను.

నేను వేసుకునే బట్టలు, తినే తిండి అంతా మారిపోయింది. నెల తిరిగేసరికి జీతం రాగానే, సగం డబ్బులు ఆ కార్డుల బిల్లులకు, బైక్ ఈఎంఐలకే పోయేటివి. అయినా నేను భయపడలా.

"ఉద్యోగం ఉంది కదా, నన్నెవడు పీకుతాడు" అన్న ధీమా

అట్టా నడుస్తా ఉంటే... గతేడాది నా జీవితంలో ఒక పెద్ద పిడుగు పడింది. మా అమ్మకు ఒంట్లో బాగాలేకపోతే పట్నంలో ఒక పెద్ద ఆసుపత్రికి తీసుకుపోయినా.

పరీక్షలు చేసి, "బాబూ, మీ అమ్మకు గుండెకు సంబంధించిన పెద్ద జబ్బు వచ్చింది. అర్జంటుగా ఆపరేషన్ చేయాల, కనీసం ఎనిమిది లక్షలు ఖర్చవుతాది" అని చెప్పినారు ఆ తెల్ల కోట్లు వేసుకున్న దేవుళ్లు.

ఆ మాట ఇనగానే నా గుండె గుభేల్ మంది. కంపెనీ ఇచ్చిన ఇన్సూరెన్స్ మూడు లక్షలకే ఉంది. మిగతా ఐదు లక్షలు ఏడనుంచి తేవాల?

ప్రాణం తోకకొచ్చింది. అప్పు ఎవరిని అడగాలో తెలీల. బ్యాంకోడికి అప్లై చేస్తే నెల రోజులు పడుతుంది అన్నాడు. అప్పుడు నా కండ్ల ముందు ఈ 'మైక్రో లోన్' యాప్స్ కనపడ్డాయి.

ఆసుపత్రి కారిడార్లో ఏడ్చుకుంటా కూర్చుని, మూడు వేర్వేరు యాపుల్లో నా ఆధార్ కార్డు, పాన్ కార్డు, కాంటాక్ట్స్ అన్నీ వాళ్లకి యాక్సెస్ ఇచ్చేసి ఐదు లక్షలు లోన్ తీసుకున్నాను.

ఆ క్షణానికి మా అమ్మ ప్రాణాలు నిలబడ్డాయి. మా అమ్మ బతికిందన్న సంతోషం ఒకటే మిగిలింది, కానీ ఆ ఆసుపత్రి బిల్లులు నన్ను తిరిగి ముత్తాతల కాలం నాటి బానిసత్వంలోకి తోసేశాయని నాకు అప్పుడు ఎరుక రాల.

అక్కడినుంచి మొదలైంది సామీ నా అసలైన నరకం. ఆ యాపోళ్లు ఇచ్చిన ఐదు లక్షలకు ప్రాసెసింగ్ ఫీజులు, దొంగ వడ్డీలు అన్నీ కలిపి అది ఏడు లక్షలైంది.

నెల తిరిగేసరికి ఆ యాపుల వాళ్లకు కట్టాల్సిన వడ్డీలే నా జీతాన్ని దాటిపోయినాయి. క్రెడిట్ కార్డు బిల్లులు కట్టలేకపోయేసరికి వాడు లేట్ ఫీజులు వేసి నా అసలును రెట్టింపు చేసినాడు.

ఉదయం లేస్తే చాలు... నా ఫోనుకు వందల మెసేజ్ లు. యాపోడి రికవరీ ఏజెంట్లు ఫోన్లు చేసి గలీజు గలీజు బూతులు తిట్టడం మొదలుపెట్టినారు.

"సార్, ఒక్క దినం టైం ఇయ్యండి సార్, మా అమ్మకు మందులు కొన్నాను" అని నేను బతిమాలుకుంటా ఉంటే...

"ఒరేయ్ ఎదవ, ఈ రోజే కట్టకపోతే నీ ఫోన్ బుక్ లో ఉన్న నీ కాంటాక్ట్స్ అందరికీ నువ్వు పెద్ద ఫ్రాడ్ అని, నీ ఫోటో మార్ఫింగ్ చేసి పెడతానురా" అని వాడు బెదిరించినాడు.

ఆ మాట వినగానే నాకు చెమటలు పట్టిపోయినాయి. పరువు పోతుందన్న భయం నన్ను ప్రాణాలతో తినేస్తా ఉంది.

రోజుకో కొత్త యాప్ లో అప్పు చేయడం, ఈ పాత అప్పుకు వడ్డీ కట్టడం. ఒక అప్పు తీర్చడానికి పది అప్పులు. ఉదయం ఆఫీసుకు పోతే... నా మేనేజర్ గాడు పిలిచి పబ్లిక్ లో నా మీద అరుస్తాడు.

"నీ పెర్ఫార్మన్స్ చెత్తగా ఉంది శివా. ఈ టార్గెట్లు రీచ్ కాకపోతే నేను నిన్ను ఫైర్ చేయాల్సి వస్తాది" అని బెదిరిస్తాడు.

లోపల రక్తం ఉడికిపోయి, ఆ మేనేజర్ గాడి కాలర్ పట్టుకుని "నా ఉద్యోగం నాకు వద్దురా, రిజైన్ చేసి పోతా" అని ముఖం మీద ఉమ్మేసి బయటికి రావాలనిపిస్తాది సామీ.

కానీ... ఆఫీసు గడప దాటకముందే నా జేబులో ఉన్న ఫోన్ వైబ్రేట్ అవుతాది.

"టుడే ఈజ్ యువర్ లాస్ట్ డేట్ ఫర్ ఈఎంఐ. పే నౌ " అన్న మెసేజ్ కనపడతాది.

ఆ మెసేజ్ చూడగానే నా కోపం అంతా ఆవిరైపోతాది. కాళ్లు చేతులు వణుకుతాయి. ఉద్యోగం పోతే ఈ అప్పులు ఎట్టా కట్టాల?

కట్టకపోతే యాపోడు పరువు తీస్తాడు, పోలీసోళ్లు వచ్చి జైల్లో పెడతారు. జైల్లో పెడితే మా అమ్మ గుండె ఆగి చచ్చిపోతాది.

అందుకే... నేను తలదించుకుని, ఆ మేనేజర్ గాడి ముందు చేతులు కట్టుకుని, "సారీ బాస్... నెక్స్ట్ మంత్ టార్గెట్ తప్పకుండా రీచ్ అవుతాను. ప్లీజ్ బాస్, నాకు ఈ ఉద్యోగం చాలా అవసరం" అని వాడి అరికాళ్లు నాకినంత పని చేసి బయటికి వస్తాను.

నిన్న మధ్యాహ్నం ఆ ఏసీ క్యూబికల్ లో కంప్యూటర్ స్క్రీన్ ముందు కూకుని యోచిస్తా ఉంటే... నా కండ్లల్లో ధారగా నీళ్లు తిరిగాయి.

ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టినట్టు నా మెదడులో ఒక నిజం వెలిగింది. మా వోబులేసు తాతకు, నాకు అసలు తేడా ఏందీ?

వాడు ఆ దినాల్లో కేవలం పది వరహాల అప్పు కోసం జీవితాంతం ఆ ఊరి దొర కింద తలవంచుకుని వెట్టి చాకిరి చేసినాడు.

వాడి వడ్డీలు ఎప్పటికీ తీరలా. నేను ఆరు లక్షల అప్పు కోసం జీవితాంతం ఈ కార్పొరేట్ కంపెనీల యజమానుల కింద, ఈ మేనేజర్ల కింద రక్తం కక్కుకుంటా వెట్టి చాకిరి చేస్తా ఉన్నాను.

వాడికి ఆ దొర రాసిచ్చిన 'తాళపత్రం ' వాడికి ఉరితాడు అయితే... నాకు కంపెనీ వాడు ఇచ్చిన 'ఆఫర్ లెటర్ ' ఆన్లైన్ అగ్రిమెంట్లు నాకు ఉరితాళ్లు

మా తాత ఏనాడైనా పని చేయనని ఎదురు తిరిగితే ఆ దొర చేతిలో ఉన్న 'తోలు కొరడాతో' కొట్టేటోడు. ఇప్పుడు నేను ఏనాడైనా నా హక్కుల గురించి మాట్లాడితే, పర్సనల్ లైఫ్ కావాలని సెలవు అడిగితే... నా మేనేజర్ చేతిలో ఉన్న 'పెర్ఫార్మన్స్ రివ్యూ', 'రేటింగ్స్' అనే కొరడాతో నా వీపు పగలగొడతా ఉండాడు.

మా తాతను ఆ దొర పశువుల పాకలో ఒక కొయ్యకు కట్టేసి బందీని చేసినాడు. నన్ను ఈ ఆధునిక సమాజం, ఈ బ్యాంకులు, ఈ ఈఎంఐలు నా ఏసీ క్యూబికల్ సీటుకు కట్టేసి బందీని చేసినాయి

మా తాత ఒంటి మీద చెమట వాసన, పేడ వాసన వస్తే... నా ఒంటికి ఖరీదైన పర్ఫ్యూమ్ వాసన వస్తా ఉంది. వాడు కడుపు మాడ్చుకుని చచ్చినాడు... నేను జొమాటోలో పిజ్జాలు తిని ఛావు కోసం ఎదురుచూస్తా ఉన్నాను.

తేడా ఏముంది సామీ? ఏమీ లేదు. ఈ ప్రపంచంలో బానిసత్వం పోలేదబ్బా... దాని రూపు మాత్రమే మారింది. అప్పుడు ఊరికో జమీందారు ఉండేటోడు, ఇప్పుడు ప్రతి కంపెనీకీ ఒక బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఉండారు.

మన నెత్తురు పీల్చడానికి అప్పుడు జలగలు చెరువుల్లో ఉండేటివి... ఇప్పుడు సూట్లు, బూట్లు వేసుకుని క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్లు అంటూ మన ఆఫీసుల చుట్టే తిరుగుతా ఉండాయి.

అప్పుల ఊబిలో ఇరుక్కున్న ప్రతి ఉద్యోగీ ఈ కార్పొరేట్ వ్యవస్థకు ఒక బానిసే. మనం కట్టే పన్నులు, మనం కట్టే వడ్డీలు ఈ కొత్త భూస్వాముల ఖజానాలను నింపుతా ఉండాయి.

కార్ల్ మార్క్స్ అన్న పెద్దాయన ఎవరో ఏదో పుస్తకంలో చెప్పినాడంట... "శ్రామికుడికి కోల్పోవడానికి సంకెళ్లు తప్ప మరేమీ లేదు" అని.

కానీ ఈ 2026 నాటికి నా పరిస్థితి ఏంటంటే... ఆ సంకెళ్లు తెంచుకోవాలని ఎదురు తిరిగితే, కోల్పోవడానికి నా పరువు, నా భవిష్యత్తు, నా ప్రాణం ఉండాయి.

అందుకే సామీ, ఉదయం కాగానే ఇస్త్రీ చేసిన బట్టలు వేసుకుని, మెడకు టై కట్టుకుని, నా బానిస సంకెళ్లకు పాలిష్ చేసుకుని నవ్వుతా ఆఫీసుకు పోతా ఉంటాను.

ఒకప్పుడు తలపాగా పెట్టుకున్న దొరకు దండం పెట్టేవాణ్ణి, ఇప్పుడు సూటు వేసుకున్న బాస్ కు "గుడ్ మార్నింగ్ బాస్" అని దండం పెడతా ఉన్నాను.

రూపం మారినా బానిసత్వం మారలా సామీ... బానిసత్వం మారలా. ★★★

COMMENTS